చిన్నకథ

# తనూ, తనకథా

రచన: శ్రీ పులిపాక జగన్నాథరావు

[రెండు హృదయాలమధ్య తన హృదయ పరివర్తనకు ఆవేదనపడిన యువతి తత్వాన్ని ఈ రచన అందజేస్తోంది. ఒకరిని భర్తగా అనుకుంటే మరొకరు శాస్త్రరీత్యా భర్త అయాడు. ఈ ద్వంద్వావస్థలో యువతి పరివేదనే ఈ రచన.]

●

'వారు...వచ్చారా' అన్నది తను బలహీనంగా, వచ్చేదగ్గును ఆపుకునే నిమిత్తం రొమ్మును చేతులతో అదుముకుంటూ. దేనికో సదాశివంపై తన ఆపేక్ష కట్టలు తెగి కలవరిస్తుంది! తను పేరు 'చంద్రవాణి' ఐనా తన్నందరూ 'వాణీ' అని పిలుస్తారు. సదాశివం మాత్రం చిత్రంగానూ, ప్రత్యేకంగానూ, ఆపేక్షగాను తనను 'చంద్రవంకా' అని పిలుస్తాడు. అప్పుడు తనముఖం మల్లెమొగ్గలా వికసిస్తుంది. తనకూ సదాశివానికీ వారం రోజుల్లోనే పెళ్లి. తనకెందుకో ఈ ఆతుర్దా! తన మనస్సు సదాశివం కోసం యిలా వేగిరపడుతున్న దేమిటి? 'వారు...వచ్చారా' అనే మాటను సదాశివాన్నిగూర్చి మనస్సులోనే అనుకోటానికి తను పూర్వం చాలా సిగ్గుపడేది. దేనికంటే సదాశివం తన మిత్రుడూను, పైగా యిలాంటి గౌరవం తను యిస్తుందని తెలిస్తే అంతగా సంతోషించడు కూడాను! అదీగాక తన సిగ్గుకూడా ఒక కారణమే! ఈమాటను తను ఏమీ సిగ్గులేకుండా గాంభీర్యంగాను, గౌరవంగాను అప్రయత్నంగా చలపతిముందూ తండ్రియెదటా యిప్పటికి ఉదయంమొదలు ఈమధ్యాహ్నం వరకు పదిసార్లయినా అన్నది. ఈ గుండెజబ్బు అనుకోని విధంగానేవచ్చి, అనుకోని విధంగానే పోతూ ఉంటుంది. తనకిప్పుడేమీ తోచటంలేదు. తను తనకేమీ తోచటంలేదని సదాశివంతో అంటే అతను నవ్వుతూ 'ఏమోమరి! నాకామాటకు అర్థం తెలీదు. నాకెప్పుడూ తీరికే వుండదు. నా ఈమాట నిజమో కాదో మన చలపతి నడుగు కావాలిస్తే!' అంటాడు. తనూ, సదాశివమూ, చలపతీ ముగ్గురూ కలిసి కళాశాలలో మొట్టమొదటి రెండేళ్లు చదివారు. అప్పటికీ యిప్పటికీ ఐదేళ్ళు గడిచాయా! ఏమో, ఆమాట చలపతి డాక్టరుగావచ్చి, ఈ మదరాసులో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించి, ఇప్పుడు తన శరీరపు బాగునుచూస్తున్న దాన్నిబట్టే అనుకోవాల్సి వస్తుంది. ఎంతలో ఐదేళ్ళు గడిచిపోయాయి!! అవీ సదాశివానికి యెంత కృంగదీశేవిగా, బరువుగా, అతని ఆత్మగౌరవాన్ని తెలియచేస్తూ గడిచిపోయాయి!

ఈ నిశ్శబ్దాన్ని తను భరించలేకుండా వున్నది. తనతండ్రి గదిలోనుంచి రేడియోలో సైగల్ పాట వినవస్తున్నది. సదాశివానికి కొంతకాలం సైగల్ అంటే తగని పిచ్చిగా వుండేది. దానికని యిప్పటికీ తన తమ్ముడూ చెల్లెలూ అతన్ని ఆపేరుతో పిలిచి ఎగతాళి చేస్తుంటారు. సదాశివానికి పసిపిల్లలంటే

ఎంత పరవానో వాళ్లే ఎగతాళి అన్నా అంతే ముచ్చట! సైగల్ శ్రోతల్ని సుఖపెట్టేటట్లు మరే గాయకుడూ సుఖపెట్టలేడని తన గట్టినమ్మకంగా సదాశివం మొన్నటిదాకా అనేవాడు. ఇప్పుడు గాంధీమహాత్ముడి పొదుపు తనానికి, ఉన్నదున్నట్లుగా కనబర్చటానికి, గుండె నిబ్బరానికి, నడతకూ తనని అమ్మేసుకున్నట్లుగా రాస్తున్నాడు. సదాశివం లాంటి మనుష్యులకి యెప్పుడూ యెవరో వొకరు ఆదర్శంగా ఉంటూనే ఉంటారు. తమ అంతరాత్మల్ని పరిశోధించిన మీదట వారికి ఆదర్శంగా కనిపించిన వారి అడుగుజాడలో వాళ్లు నడివటం మంచిదే! కాని వాళ్ళకి ఆదర్శంగా ఉంటే మనుష్యుల్లోని తప్పుల్ని, లోపాల్ని వాళ్లు వేలెత్తి చూపటానికి వెనుదీయకుండా ఉండాలి! వాళ్ళు ఆతప్పుల్ని తాము తిరిగి చేయకుండా జాగ్రత్త పడాలి!...సదాశివం తనను పెళ్ళి చేసుకోటానికి ఈ ఐదేళ్ళలోనూ అనేక అభ్యంతరాల్ని చెప్పాడు. తను అన్నింటికీనూ అతని తాహతుకుమించి వున్నదట! అతను ఈమాట తనమీద ప్రేమలేక, పెళ్లినుంచి తప్పించుకోటానిక సాకుగా చెబుతున్నాడని తనే అనుకోలేదట! మరి కేవలం అతని స్థితిగతులు, అడ్డంకుల్ని యోచించే ఈ వర్ణాంతర వివాహానికి యిష్టపడటం లేదట! అవును! సదాశివానికి పెళ్లికావాల్సిన చెల్లెళ్ళు వున్నారు మరి! ఈ ఐదేళ్ళలోనూ తనను తమకులంవాడైన చలపతికీ యిచ్చి పెళ్లిచేయాలనుకున్నాడు తన తండ్రి, కాని తను సదాశవం అంటే యెంత పిచ్చిగా తపించిపోతున్నదో గమనించి వుంటాడు తనతండ్రి! దానికనే తన తల్లికి విడ్డూరంగా ఉన్నా ఆయన ఇంతకాలం తనపెళ్లి ఆపివుంచాడు. అమ్మ! ఎట్లాగయితేనేం, యిప్పటికి సదాశివం కప్పుకున్నాడు. నిజం ఆలోచిస్తే తను తన విషయంతోనే ఎల్లప్పుడూ క్రిందా మీదా పడుతున్నది కాని సదాశివం కష్టాలకు వీసమెత్తు విలువనిచ్చి ఆలోచిస్తున్నదాకి అతని చెల్లెళ్లు అతని మాటప్రకారమే బొత్తిగా అందచందాలు లేని వాళ్లు. ఏమిటో ఈప్రపంచం! ఒక్కొక్కప్పుడు మనుష్యుల కష్టాలు ఎంత గడ్డువిగా ఉంటై! ఆమాటకొస్తే నిత్యం తను తనకళ్ళతోనే చూస్తున్నది—ఓ ఐదారుగురు కుర్రవాళ్లు తన మెడవంక ఆశతో ఎంగిలి విస్తరాకులకోసం కుక్కలతో పోట్లాడుతూ కాచుకొని కూర్చోవటం. ఏపాపం ఎరుగని, నోరూ వాయీలేని తన చెల్లెలూ తమ్ముడూ లాంటి పిల్లలు అలా కుక్కలకు, కాకులకూ మించకుండా (ఇంకా హీనంగా నేనేమో!) బ్రతుకుతూ వుండడాన్ని చూసి తను ఏంచేస్తుంది గనుకా! కుక్కలకు కాకులకూ లేని జ్ఞానం మనిషికి వుండి ఏం వ్యక్తంచేస్తున్నాడు గనుక తను కుక్కల్ని కాకుల్ని తక్కువగా నిర్లక్ష్యంగాను చిన్నచూపు చూస్తుంది! అదీగాక సాధుజంతువుల్ని, చెట్లచేమల్ని ఆపేక్షగాను దయతోను చూడటాన్ని తనకు సదాశివం నేర్పాడు. కఠినంగా అనవసరంగా జరిగే జీవహింసను అతనే మాత్రం చూసి సహించలేకుండా వున్నాడు...

తన తల్లీతండ్రీ సదాశివాన్నీ, చలపతినీ బాగా ఎరుగుదురు. తనకు ఈ గుండెజబ్బు వచ్చినప్పుడల్లా యింతే! తను ఏకాంతతను, నిశ్శబ్దతను అభిలషిస్తుందని తనగదిలోకి ఎవరూరారు. తన స్థితిచాలా చిత్రమైంది. కాసేపు చాలా ఆరోగ్యంగా వుంటుంది. అకస్మాత్తుగా స్మృతి తప్పిపోతుంది. అప్పుడేం జరుగుతుందో తనకి బొత్తిగా తెలీదట!...... చలపతి చాలా యోగ్యుడనీ, మంచి నడతగలవాడని తనతండ్రి తనతో చాలాసార్లు అన్నాడు. చదరంగం తనతోనూ, తన తండ్రితోనూ ఆడుతూ, అతను చిత్రంగా, ఒక్కొక్కరాత్రి, కొంచం పొద్దుపోతే, తన గదికి పోవటానికి బద్ధకించి తమ ఇంట్లోనే భోంచేసి పడుకుంటాడు. తెలుగుదేశంలోని ఓ పల్లెటూర్లో స్వగృహాన్నీ, పొలాన్నీ కనిబెట్టుకొని ఉంటూ అతనెంత బ్రతిమాలినా మదరాసులో కాపరం చేయటానికి ఒప్పుకోలేదట అతని తండ్రి! ఇదీ అతను తన తండ్రితో చెబుతూ వుండగా తను విన్నదేకాని తను అడిగి తెలుసుకున్న విషయంకాదు. తను ఎంతసేపు సదాశివాన్ని గురించి అదొక వాంఛతో ప్రేమతో

కలవరిస్తూ వచ్చిందే కాని మరోమనిషిని గురించి కాని, మరో విషయాన్ని గురించికాని రవ్వంత యోచించిందా? అతని తోబుట్టువుల సంగతి, తల్లితండ్రుల సంగతి, ఆస్తిపాస్తుల సంగతి ఒక్కసారైనా పరామర్శచేసి, ఉంచినట్లయితే చలపతి ఎంత ఆనందించి వుండును?...

ఒకనాటి సాయంకాలం తనూ, తన తండ్రీ, చలపతీ, సదాశివమూ తమతోటలో కూర్చుని అనేక విషయాలమీద అనేక అభిప్రాయాల్ని వెలిబుచ్చారు ఓయేడాది క్రితం. తను కేవలం వింటూకూర్చుంది. వాళ్ళ అభిప్రాయాలూ విశ్వాసాలూ. వాటిని వాళ్ళు వెలిబుచ్చిన తీరూ తనకి కొంచంగా గుర్తు! ఒక మనిషి జీవితంలో సుఖపడాలంటే తనంటే ఎవరికిష్టమో, ఎవరి కయిష్టమో తెలుసుకోవాలి. 2. తనకు తెలీని విషయాల్ని తెలుసుకోవాలి. 3. జీవితంలో కేవలం పెద్దపెద్ద ఆశయాలు పెట్టుకుని అనుసరింపచూస్తే ఒకొక్కొక్కప్పుడు చిక్కువస్తుంది. మనిషి అబద్ధం ఆడవల్సివచ్చే ఘడియలుకూడా జీవితంలో ఉంటై. 4, ముసలివాళ్ళు వాళ్ళ మనమళ్ళుకూడా తమలాగానే బూజుపట్టిన సిద్ధాంతాల్ని సందేహించకుండా ఎదురుమాట చెప్పకుండా అనుసరించాలని, తమలాగే తయారుకావాలని అనుకుంటారు. 5. ఒకోక్కసారి కొందరు గొప్పవ్యక్తులు తమమీద కత్తులుదూసే వాళ్ళను తక్కువ చేయటం ద్వారా గొప్పతప్పుచేసి దెబ్బతింటారు. తమ విరోధులకు ఎంత విలువ ఇవ్వాలో గ్రహించి అంతకు తక్కువగాని గౌరవాన్ని వాళ్ళకు యివ్వటం ఉచితం. 6. మనం విషయాన్ని గురించి వాదనచేయాలనుకుంటే మీరు నామనష్యాన్ని కావాలి. అంటే నామీద మీకు మీమీద నాకూ గౌరవం, విశ్వాసం, నమ్మకం, మమకారం—వీటిల్లో ఏఒక్కటైనా వుండాలి. 7. ఒకమనిషి తానసుభవించిన ఒక బాధనుగురించి నప్పుడు పొందే బాధను చాలా కొద్దిగా పొందుతాడు. 8. సామాన్యంగా డాక్టర్లు, వ్యాపారస్థులు, అధికార్లు తమ సహాయాన్ని అపేక్షించి వచ్చిన వ్యక్తి చాలా కష్టాల్లో వున్నాడని నమ్మకంగా తెలిసినా ఉత్తసానుభూతిని (అదేమీ విలువలేనిదైనా) అరుదుగా కనబరుస్తారు. 9, ఒకడు యోగ్యుడు, ఇరుగుపొరుగుకూ కష్టాల్లో ఉన్న వాళ్లకు నిష్కామంగా తోడ్పడతాడు, అవి పూర్తిగా అనుకోటానికి ఈభూమ్మీద ఏవ్యక్తికీ అవకాశం యివ్వటంలేదు. ప్రతిమనిషీ తాను యోగ్యుడని ఒక మేలు జనులకుచేసి రుజువుచేసుకోవాలనుకుంటే బాగుండును. ఈనాటి మనిషి తాను నాగరికుణ్ణని గర్వంగా వెన్నువిరిచి బాకాలూదటానికి బొత్తిగా కారణం కనిపించదు. నీతిమాటకు వస్తే బుద్ధుడికాలంనాటి మనిషే ఈనాటి మనిషికంటె మెరుగు. సదాశివం యిలా తన అభిప్రాయాల్ని వెలిబుచ్చినట్లు జ్ఞాపకం. 1. ఏమనిషిలో ఆమనిషికి నమ్మకం ఉండాలి. ఇతరులకోసం జీవించే ముందు ఒక మనిషి తనకోసం కొంతకాలం జీవించటం మంచిది. 2. ఒక మంచివిషయాన్ని చెప్పటానికి ఓగొప్పవాడే నోరుచేసుకోవాల్సిన పనిలేదు. ఒకొక్కప్పుడు సాధారణపు మనిషే ఎంతో యితరులకు మేలుచేసే విషయాల్ని చెప్పగలడు. 3. శుభ్రత్వంతో బ్రతకటానికి బీదతనం కొంత అడ్డువస్తుందిగాని కొంత మనిషిలోకూడా ఉంటుంది. 4. ఆత్మకు ప్రాధాన్యత యిచ్చేవారికి మానసికమైన వ్యభిచారానికీ, భౌతికమైన వ్యభిచారానికి భేధం స్వల్పం. 5. ఒకొక్కొక్కప్పుడు ఒకమనిషి కష్టాలకుగాని మరొకమనిషి సుఖాలకుగాని అర్థం ఉండదు. చాలా న్యాయంగా మంచిగా సంచరించే మనిషి నిష్కారణంగా శిక్షకు పాల్పడవచ్చును. మరోమనిషి యితరుల కష్టాలకు సామభూతైనా చూపకుండా జీవితాన్ని ఎగతాళిగా, హాయిగా గడపివేయవచ్చును. వీటికి అర్థం ఏమిటి? మంచి సంఘవ్యవస్థ చాలావరకు ప్రజల కష్టాల్ని, సమస్యల్ని పరిష్కరించగలదు. కాని ఒక మనిషి ఆరోగ్యంగా, చక్కని మెదడుతో బ్రతకటానికీ మరోమనిషి జీవితంపొడుగునా అనారోగ్యంతో, భారంగా, బ్రతకటానికి కారణం కనిపించదు. 6. యవ్వనంలో పురుషుడు చూసేది స్త్రీ శరీరాన్ని, అందాన్నే కాదంటే

జుట్టులేని విధవను పెళ్లాడమంటే ఏ సంస్కారి ముందుకువస్తాడు?—తన తండ్రి ఈఅభిప్రాయాల్ని వెలిబుచ్చి ముగ్గుర్నీ నవ్వించాడు. 1. అప్పుచేసి బ్రతికి బయటపడక పోవటం కేవలమూ తెలివితక్కువకాని పరిస్థితుల్లో అప్పుఅనేది అసలు చేయరాదు. 2. ఒక మనిషినిగురించి బాగా తెలుసుకోనిదే తేలిగ్గా తొందరపడి నమ్మకూడదు. 3. మనం బ్రతకటంకోసం నేర్చుకోవాలి నేర్చుకోటానికి బ్రతకాలి. 4. సాంఘిక వ్యవస్థడబ్బు అనేది లేకుండా ఏర్పడి అందరూ తిండీ గుడ్డా కలిగి సమానత్వంతో బ్రతికే ఉపాయమేమన్నా ఉన్నదా? 5. ఎంత ఆహారం తింటాడో మనిషి దానికి తగినట్లు పనిచేస్తే ఈ జబ్బుల గొడవ చాలావరకు లేకపోను!—తన తండ్రిలాగా సంతానాన్ని వాళ్ళ అభిరుచులు, అభిప్రాయాల్ని అనుసరించి పెంచటం ఉత్తమమైన పద్ధతి అనే విషయం మీద మాత్రం తనూ, చలపతీ, సదాశివమూ వాదను ఏమీ లేకుండా ఒప్పుకున్నారు..

పాపం. సదాశివం ఐదేళ్ళక్రితం తండ్రి చనిపోవటంవల్ల చదువు ఆపివేసి కుటుంబ వ్యవహారాలను పరిశీలిస్తున్నప్పటినుంచీ మారి పోయాడు. బాధ్యతతో, జాగ్రత్తగా, అవసరం ఉంటేనే తనతోకూడా మాట్లాడుతున్నాడు. జ్ఞాపకశక్తి సన్నగిలి పోయిందనీ, ఒక విషయాన్నీ గురించీ పరిశీలన చేయలేక పోతున్నాననీ, జీవించటం భారంగాను, విసుగుగాను అయిష్టంగాను ఉన్నదని రాస్తున్నాడు. మరి చలపతి? అతని సంగతి తనకు అంతగా తెలీక పోవటం తనకే ఆశ్చర్యంగా వుంది. ఉదయాన తను 'వారు...వచ్చారా' అని అడిగినప్పుడు చలపతి నవ్వుతూ తనను 'చంద్రవంకా' అని సదాశివం లాగా పిలిచాడు. ఆ సదాశివం పిలుపుతో తన ముఖం ఒక్కసారిగా జీవంతో తొణికిసలాడినా తన శరీరం అకారణంగా కంపించింది. రేపు ఉదయానికి కానిరాడట సదాశివం! అదిగో! ఉదయిస్తూన్న చందమామ ఎర్రగాను, గుండ్రంగాను ఎవరో శీలంగలపడుచు పెట్టుకున్న కుంకుమ బొట్టులాగా ఉంది. శీలంగలపడుచు! 'శీలంగలపడుచు' అంటే తనకు సదాశివం వెనుక వెన్నెల చీకట్లోకి మారుతూ ఉండగా ఓనాటి రాత్రి చెప్పిన కథగుర్తుకి వస్తున్నది. ఒక శీలంగలపడుచు తను ఎంతో ప్రేమించి చేసుకోబోతూన్న పెళ్ళికి వెళ్ళి ఆచార ప్రకారం పెళ్లికొడుకు ఇంటికి తరలిపోతూ దారిలో రాత్రి కాగా ఓ పల్లెలో నమ్మకస్తుడైన స్నేహితుని ఇంట్లో బసచేసిందట! ఆ వసంతకాలపు హాయిగొల్పే పున్నమరేయిన...శీలంగలపడుచు యొక్క అసాధారణమైన...అంద చందాలకు...ఇంగితాన్ని జ్ఞానాన్నీ మరిచి, ఆమె నమ్మకాన్ని, అమాయకత్వాన్ని కూడా లెక్కచేయక,...విస్మరించి... ఆమె నిద్రలో వుండగా...ఆమెను...మరునాడు తెలవారుజామున...తన కంటినీటితో భవిష్యత్తునంతా...కాటుక నలుపుచేసుకుంటూ...చనుకట్టును తన ఆ స్నేహితునికి...అతనికి తను జీవితం పొడుగునా కనబోయే సంతానానికి ఇచ్చివేయ నిశ్చయించుకొని...తన తలితండ్రులకు...ఆ స్నేహితుణ్ణే...తన పెనిమిటని నచ్చచెప్పి...వివాహం చేసుకున్నదట! ఈ పడుచు ఇలా చేయటాన్ని 'మంచిదే' అని తనూ సదాశివమూ విచారంతోనే ఐనా ఒప్పుకున్నారు. కథ ముగించి సదాశివం ఇలా అన్నాడు కూడాను :- 'మరి శరీరం అమ్ముకుని బ్రతికేవారి ప్రసక్తి తీసుకురాబాకు! వాళ్ళు బ్రతకటానికీ, ఆకలిబాధను ఉపశమింప చేసుకోటానికి శీలాన్ని అమ్ముకుంటున్నారు. వాళ్ళని సంఘం అలా తయారు చేసింది. అన్నం లేకపోతేసరి నీతీ మారుతుంది, ఆశయమూ మారుతుంది. ప్రతి ఆడమనిషీ కర్శించాలి, క్లిష్టమైన గడ్డు సమస్యను ఎదుర్కోవాల్సిన పనిలేకపోతే, 'శీలంగలపడుచు' లాగా శీలంతో బ్రతకాలని ఆరాటపడదని నువ్వు అనగలవా? ఐనా నీతికీ ఆశయానికీ కొలతబద్ద ఏమిటి? ప్రతి మనిషికి తిండీ, గుడ్డా,

చదువూ, స్వేచ్ఛా వున్నది గనుకా!...ఇదేమిటి? తనకీనాడు ఇలాంటి ఆలోచనలు వస్తున్నై? తన మనస్సు, పేగులు తన భవిష్యత్తంతా చీకటిగాను, శూన్యంగాను, అగాధంలాగా వుంటుందని ఇలా అరవటానికి, హెచ్చరిక చేయటానికి కారణం కనిపించదే! తన సదాశివం...తన కాబోయే పెనిమిటి రేపు ఉదయానికల్లా వస్తాడు. వారం రోజుల్లో నే పెళ్ళినాటిరాత్రే...తన్న తను...దగ్గరికి...తీసుకుని ముద్దుపెట్టుకుంటాడు. తను...అతని చేతుల్ని గట్టిగా...రొమ్ముకు అదుముకుంటుంది. ఈ తలంపుకే తన గొంతులో సంగీతం...ముఖంలో సిగ్గూ... తలలో మల్లెచెండూ, హృదయంలో ప్రేమా, శరీరంలో కామం, ప్రతి రక్తనాళంలోని జీవశక్తీ సదాశివం స్పర్శకు ఆనందంతో పులకరిస్తున్నై, పరవశంతో ఊయల లూగుతున్నై. అదుగో, చలపతి వస్తున్నాడు. చలపతీ, సదాశివమూ ఆంతరంగిక మిత్రులు. వాళ్ళిద్దరిలోనూ రహస్యాలు ఏమీ లేవు. చలపతి తనతో ముఖాముఖిగా ఒకటి రెండుసార్లకంటె మాట్లాడలేదు. ఎప్పుడూ తప్పుకు తిరుగుతూ ఉంటాడు. పక్షం క్రితం ఒకసారి తను చనువుగా చదరంగం ఆటలో అతని పవిత్రమైన గెలుపుకు, తన ఏమాత్రమూ తలచని ఓటమికి అతన్ని తాకి అభినందించగా చూసి ముఖం పక్కకి తిప్పుకున్నాడు. తన ముఖం ఎంత కళకళలాడుతూన్నది! తనకి మళ్ళీ స్మృతి తప్పిపోవటం లేదుకద!...

* * *

తనకిప్పుడంతా...అర్థమవుతున్నది. నిన్నల్లా ఎడతెగకుండా...తలవని తలంపులు పరంపరలుగా దేనికి వచ్చాయో...తన కిప్పుడంతా...అర్థమవుతున్నది. సదాశివం, వచ్చాడుకాని...అతని ముఖం తను ఎలా చూస్తుంది?...మరి ఇక బ్రతుకు... శూన్యంగా...చీకటిగా...ఆవేదనగా వుంటుందని తన పేగుల అరుపుకు...రాత్రి...కారణం కనిపించలేదూ? చలపతిని ..నిందించి...ప్రయోజనం లేదు ఇప్పుడు చలపతి...తన పెనిమిటి...'శీలంగలపడుచు' విషయంలో...తన అభిప్రాయమూ...సదాశివం అభిప్రాయమూ ఇంతే!...చలపతి...రాత్రి...అంతా ఐపోయాక...తన బావిని గూర్చి...ఏడుస్తూ చెప్పిన మాటల్లో...కల్లాకపటాలు ఏమీ లేవు...తను అంత అందంగా...కనిపించిందట!...పాడు చక్కదనం! ఇదే తనకి...స్మృతిలేనప్పుడు...తను తరువాత...పెనుగులాడినా...జ్ఞానంలో ఉన్నప్పుడు...కన్నీళ్ళతో అడ్డుచెప్పి బతిమిలాడినా...లాభం లేకపోయింది...ఈ విషయంతను...బయటికి పొక్కనిచ్చిందా...అదే చలపతికో...తన పెళ్ళికిముందు సదాశివం చెవినపడ్డదా...హత్యలు జరగవే! ...చలపతి కామంలో...ముందూ వెనకా ఆలోచించకుండా చేసినపనికి...తనకీ శిక్ష! చలపతికూడా...సదాశివం ముఖం...చూడలేకుండా ఉన్నాడు. తను చలపతిని...పెళ్ళిచేసుకుంటాను...అన్నప్పుడు తన తల్లి తన శీలంవైపు తప్పక...అనుమానంతో చూస్తుంది. తను తన...పూర్వం...సదాశివం చిత్రాన్ని...రొమ్ముకు అదుముకొని...ముద్దుపెట్టుకోగా...అనేకసార్లు తన తల్లి చూసినప్పుడు...మరి తన శీలాన్ని అనుమానించదూ?...తన తండ్రి తన వంక...జాలితో చూస్తాడు...తెల్లవారుతూ వుండగా...చలపతి ఎంత సిగ్గుపడుతూ...ముఖం చాటు చేసుకోవాలని...చీకటి కోసం వెతుకులాడుతున్నా తన తండ్రి ఎంత నమ్మకంగా...మర్యాదగా సంభాషించాడు?...అతనితో, ఇక సుఖం అనే మాటకు, తనకు అర్థం ఉన్నదని...తను నమ్మలేదు. సదాశివం...తన నుంచి మనస్సు మరలించుకోవాలని... తను వెయ్యి దేవుళ్ళకు మొక్కుతుంది. దేనికంటే ఎవ్వరూ ప్రేమించబడేవాళ్ళు...ఆప్తులులేని పక్షాన జీవితం వెలితిగా...ఖాళీగా కనిపిస్తుంది. అది తగని బాధాకరం. సదాశివం...శివశివా...